
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.330 టీఎంసీలు
సోమశిల జలాశయంలో శనివారం నాటికి 30.330 టీఎంసీల నీరు ఉంది. పైతట్టు నుంచి 1595 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,422
3శాతం జీఎస్టీతో	రూ.5,585
నవర (8గ్రా)	రూ.44,680

గరిష్టం/కనిష్టం
36.2 /27.2

వాతావరణం
శనివారం గాలిలో తేమ 57 శాతం ఉంది. ఆదివారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉద్యోగమేళాలో 232 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శనివారం జిల్లా నైపుణ్య కల్పనా సంస్థ, కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 232 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గిరి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికై న విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగ మేళాకు 431 మంది హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య కల్పనా సంస్థ అధికారి విజయవినీల్ కుమార్, జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మెంటార్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పాపకు పెద్ద కష్టం

- న్యూరోలాజికల్ డిజార్డర్‌తో పోరాటం
- వైద్యానికి లక్షల్లో ఖర్చు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు



అనారోగ్యంతో ఆసుపత్రిలో బాలిక శ్రావ్య

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ కొత్తపల్లిపాళేనికి చెందిన మాకా సురేష్, భవానీలకు ఏడాది వయసు ఉన్న శ్రావ్య అనే కుమార్తె ఉంది. పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగానే ఉన్న ఈ బాలిక ఇటీవల అనారోగ్యంగా ఉండడంతో వైద్యశాలలో చూపించగా న్యూరోలాజికల్ డిజార్డర్ ఉందని పరీక్షలు నిర్వహించి తేల్చారు. తొలుత ఒంగోలులోని చిన్న పిల్లల వైద్యశాలలో వైద్యం చేయించారు. తరువాత అక్కడ కూడా తగ్గకపోవడంతో విజయవాడలోని రెయిన్‌బో చిన్న పిల్లల వైద్యశాలలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. అక్కడే పీఐసీయూ కేర్‌లో చికిత్స పొందుతోంది. ఈ వ్యాధి నయం కావడానికి సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. స్థానికంగా ఉన్న పెద్దలకు తెలియచేశారు. వారు కొంత సాయం చేశారు. ఇప్పటి వరకు దాతలు, వారి వద్ద ఉన్న నగదు కలిపి దాదాపు రూ.3 లక్షలు వైద్యశాలకు వెచ్చించారు. తరువాత డబ్బులేక వైద్యశాలలోనే ఉంచారు. బ్రెయిన్ ట్యూమర్‌గా ఈ న్యూరోలాజికల్ డిజార్డర్ తయారవుతుందని వైద్యులు చెప్పారని తెలిపారు.

మా బిడ్డను బతికించండి

మా బిడ్డను ఎలాగైనా దాతలు స్పందించి బతికించాలని పాప శ్రావ్య తల్లిదండ్రులు సురేష్, భవాని కోరుతున్నారు. తాను బేల్దారి పని చేసుకుంటూ జీవిస్తున్నానని, బంధువుల వద్ద కొంత డబ్బు తెచ్చి వైద్యం చేయిస్తున్నట్లు చెప్పారు. దాదాపు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వైద్యానికి ఖర్చవుతుందని తెలిపారు. దాతలు సాయం చేసి బిడ్డను బతికించాలని దీనంగా వేడుకుంటున్నారు. పాప తండ్రి సురేష్ ఫోన్ పే నంబరు 9059778172.

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కె.నాగరాజమ్మ. పొదలకూరు వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈమెకు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వస్తున్నాయి. పెరిగి పెద్దయిన తరువాత తరచుగా మాత్రమే ఫిట్స్ వస్తుండేవి. వివాహం అనంతరం రెండో కాన్పు సమయంలో నాగరాజమ్మకు మళ్లీ ఫిట్స్ వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులంతా ఆందోళనకు గురయ్యారు. కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్దామంటే లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని భయపడి చివరకు వారం రోజుల క్రితం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లోని ప్రసూతి విభాగానికి తీసుకొచ్చారు. ఇక్కడి వైద్యులు ఆమెకు చికిత్స అందించి నాగరాజమ్మకు కాన్పు చేసి తల్లి, బిడ్డకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కాపాడారు. దీంతో ఆ కుటుంబ సభ్యులంతా సంతోషంతో ప్రభుత్వ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు గంధం హేమలత. నెల్లూరు నగరంలోని రామచంద్రాపురం నివాసి. ఈమె మూడోసారి గర్భం దాల్చింది. అప్పటి నుంచి హేమలత ఏదోరకంగా అనారోగ్యానికి గురవుతూనే ఉండేది. నెలలు గడుస్తున్న కొద్దీ కడుపులో శిశువు ఎలా ఉందోనని ఆమె ఆందోళనకు గురయ్యేది. నెలలు నిండటంతో ప్రసవం కోసం హేమలతను వారం క్రితం జీజీహెచ్‌కి తీసుకొచ్చారు. ప్రసూతి విభాగంలోని వైద్యులు ఆమెను పరీక్షించగా అప్పటికే చాలా వరకు బ్లీడింగ్ అయ్యింది. కడుపులోని బిడ్డ పై భాగాన ఉండాల్సిన మాయ.. కింద భాగంలో ఉండటాన్ని వైద్యులు గుర్తించారు. ఇటువంటి పరిస్థితుల్లో జీజీహెచ్ గైనకాలజిస్ట్ వైద్యులు హేమలతకు అవసరమైన మూడు ప్యాకెట్ల రక్తాన్ని ఎక్కించి చాకచక్యంగా కాన్పు చేసి తల్లి, బిడ్డను కాపాడారు.



హైరిస్క్ లోనూ సుఖ ప్రసవాలు



గర్భిణులకు ప్రాణం పోస్తున్న జీజీహెచ్

- కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరితే రూ.లక్షల్లో బిల్లుల భారం
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగానే అందుతున్న వైద్యసేవలు
- గుండె, లివర్, రక్తహీనత సమస్యలున్న గర్భిణులకు సైతం కాన్పులు
- ఏడు నెలల్లో మూడు వేల డెలివరీలు




జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: బీపీ, షుగర్, రక్తహీనత, గుండెజబ్బులు, లివర్ సమస్యలు, ఉమ్మనీరు పోవడం లాంటి లక్షణాలతో వచ్చిన అత్యంత హైరిస్క్ గర్భిణులకు పురుడు పోసేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు ముందుకు రావడం లేదు. కార్పొరేట్ ఆస్పత్రుల డాక్టర్లు, లక్షలు ఖర్చు అవుతాయని చెబుతూనే ప్రాణానికి గ్యారెంటీ లేదంటున్నారు. ఇలాంటి లక్షణాలున్న గర్భిణులకు తామున్నాం.. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యసేవలు చేస్తామంటున్నారు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ప్రసూతి విభాగ గైనకాలజీ విభాగం వైద్యులు. ప్రైవేటు ఆసుపత్రులు వద్దు పొమ్మంటే.. ప్రభుత్వ ఆసుపత్రి వారిని అక్కున చేర్చుకుంటూ తల్లీ, బిడ్డలను కాపాడుతోంది. వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. అందులో భాగంగా వైద్య పరికరాలు, మందులు, సమకూర్చుతున్నారు. డాక్టర్లు, నర్సింగ్ పోస్టులు భర్తీ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిత్యం డాక్టర్లు, సిబ్బంది కొరత ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. డెలివరీలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంతో పెద్దాసుపత్రిలో ఉచిత వైద్యంతో పాటు ఆరోగ్య ఆసరా కింద కాన్పు అయిన మహిళకు డిశ్చార్జి అయ్యేలోపు ప్రభుత్వం నేరుగా రూ.4 వేలు నగదు బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది.

ప్రసూతి విభాగంలో 13 మంది గైనకాలజిస్టులు

జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో 24 గంటలు వైద్య సేవలందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. మొత్తం 13 మంది నిష్ణాతులైన గైనకాలజిస్ట్ వైద్యులున్నారు. వీరిలో ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ ఇందిర, అసోసియేట్ ప్రొఫెసర్లు భవాని, కవిత, సుజాతపట్నాయక్, స్నిగ్ధ ఉన్నారు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వైద్యులు సుశీల, లక్ష్మీప్రియ, మాధురి, చరిత, స్వర్ణముఖి, మౌనిక, రషీదలున్నారు.

పెరుగుతున్న కాన్పుల సంఖ్య



పెద్దాసుపత్రిలో ఒకప్పుడు కాన్పుల సంఖ్య తక్కువగా ఉండేది. రోజుకు ఏడెనిమిది కేసులు కూడా అయ్యేవి కావు. ఇప్పుడు రోజుకి సరాసరి 15 నుంచి 20లోపు వస్తున్నాయి. పెద్దాసుపత్రిలో నిష్ణాతులైన గైనకాలజిస్ట్ వైద్యులు ఉండటంతో ప్రజల్లో నమ్మకం మరింత పెరిగింది. దీంతో కాన్పుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 2,771 కాన్పులు జరిగాయి. అంటే నెలకు సరాసరి 300 కాన్పులు వరకు జరుగుతున్నాయని గణాంకాల ద్వారా తెలుస్తోంది.

రిస్క్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి



ఇక్కడకు కాన్పు కోసం వస్తున్న వారిలో అధిక భాగం నిరుపేదలే. గర్భం దాల్చిన మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం లేదు. ఏఎన్ఎంలు ఇచ్చే మందులు సక్రమంగా వాడటం లేదు. అందువలనే రక్తహీనత అధికంగా ఉంటోంది. తద్వారా ఎక్కువగా రిస్క్ కేసులు వస్తున్నాయి. అయినా ఇక్కడ నిష్ణాతులైన గైనకాలజీ డాక్టర్లున్నారు. మెరుగైన వైద్యం అందించి పురుడు పోస్తున్నాం. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ అందిస్తున్న సహకారంతో వైద్య సేవలందిస్తున్నాం. గర్భిణులు జీజీహెచ్ సేవలను వినియోగించుకోవాలి.

– డాక్టర్ గీతాలక్ష్మి, ప్రొఫెసర్, హెచ్‌ఓడీ, గైనకాలజి డిపార్ట్‌మెంట్

మత్స్య రంగానికి పూర్తి సహకారం



సింహపురి సేంద్రియ మేళాలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన మత్స్య వంటకాలను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు పురుషోత్తం రూపాల, అప్పలరాజు

- కేంద్ర పథకాల అమలులో ఏపీ ముందంజ
- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల
- త్వరలోనే ఫిషింగ్ హార్బర్ ప్రారంభం
- మంత్రి సీదిరి అప్పలరాజు

నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యరంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల పేర్కొన్నారు. నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన సింహపురి సేంద్రియ మేళాను రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావుతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల మాట్లాడుతూ ఏపీలో మత్స్య రంగానికి రూ.2,500 కోట్లతో వివిధ ప్రాజెక్టులను మంజూరు చేశామని, మరో రెండు ప్రాజెక్టులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారన్నారు. కృష్ణపట్నం వద్ద త్వరలోనే జెట్టీని నిర్మించనున్నట్లు తెలిపారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏపీలోకి వచ్చానన్నారు. మత్స్య రంగానికి గత ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వలేదని, ప్రస్తుతం అన్ని విధాలుగా మత్స్యకారులను ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 30 శాతం మత్స్య సంపద ఉత్పత్తి అవుతుందని, ఈ సంపద దేశంలోనే అత్యధికంగా ఉందన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలు అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నెలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జాతికి అంకితం చేస్తారన్నారు. ఇప్పటికే ఈ ఫిషింగ్ హార్బర్ పనులు 95 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. మత్స్యకార భరోసా కింద రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు, పలు సబ్సిడీలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి జిల్లాలో ఒక హార్బర్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పులికాట్ సరస్సులో డ్రెడ్జింగు పనులకు త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, ఆప్కాప్ చైర్మన్ అనిల్‌బాబు, ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, మత్స్యకార సంక్షేమ సమితి నిర్వాహకులు పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

- ఈసారి వీఐపీ దర్శనం, పాసులు లేవు
- రాజరాజేశ్వరి దేవస్థాన మహోత్సవాల సమన్వయకర్త పెంచలరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నుంచి జరగనున్న 49వ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు, మహోత్సవాల సమన్వయకర్త సన్నపురెడ్డి పెంచలరెడ్డి తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు ఎంపీ, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకరరెడ్డి సూచనలు, ఆదేశాల మేరకు మహోత్సవాలను గతంలో ఎన్నడూ లేని విధంగా వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఈ పర్యాయం వీఐపీ పాసులు లేవని, రూ.100 టికెట్ తీసుకుని ప్రతి ఒక్కరు దర్శనానికి వెళ్లాల్సిందేనన్నారు. అలాగే హై ప్రొటోకాల్, ఉన్నతాధికారులకు మాత్రమే వీఐపీ దర్శనం ఉంటుందన్నారు. అలాగే రూ.50, రూ.30 టికెట్‌తో పాటు సాధారణ భక్తులకు ఉచిత దర్శనం కోసం క్యూలైన్ ఉంటుందన్నారు. ఈ మేరకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, కార్యనిర్వహణాధికారి సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నారని పెంచలరెడ్డి వెల్లడించారు. వాహనాల పార్కింగ్‌ను సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు అందజేస్తారన్నారు. అంతరాలయంలో ఆరుగురికి మాత్రమే ప్రవేశం, దర్శనం ఉంటుందని, హారతి మాత్రమే ఇస్తారన్నారు. గోత్రనామాలతో పూజ అంతరాలయం వెలుపల ఉంటుందన్నారు. సమావేశంలో దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పౌరహక్కుల సాధనకు సీఎల్సీ కృషి





మాట్లాడుతున్న మానవ వికాస కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు బి.సాంబశివరావు, సీఎల్సీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్య

- పౌరహక్కుల సంఘం 50 ఏళ్ల మహాసభలో వక్తల ఉవాచ

నెల్లూరు(బృందావనం): ప్రజాతంత్ర ఉద్యమాల్లో పౌరహక్కుల సంఘం ఒక ప్రధాన స్రవంతి అని, పౌర, ప్రజాస్వామిక హక్కుల సాధన పరిరక్షణ కోసం ఆ సంఘం చేస్తున్న అవిరళ కృషి ఎనలేనిదని పలు ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. పురమందిరంలో నెల్లూరు – రాయలసీమ జిల్లాల ప్రాంతీయ సదస్సు, పౌరహక్కుల సంఘం (సీఎల్సీ) 50 ఏళ్ల మహాసభ శనివారం నిర్వహించారు. పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు ఓ.అబ్బాయిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రజాసంఘాలకు చెందిన రాష్ట్ర నేతలు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఉదయం జరిగిన సదస్సులో సీఎల్సీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్య మాట్లాడుతూ గత 50 ఏళ్లలో పౌరహక్కుల సంఘం గమనం – గమ్యంపై ఉపన్యసించారు. ప్రజల హక్కులను కాపాడేందుకు గత ఐదు దశాబ్దాల కాలంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని గమ్యం దిశగా అలుపెరుగని పోరాటం సాగుతుందన్నారు. మహాకవి శ్రీశ్రీ అధ్యక్షుడిగా 1973లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాజ్యహింసపై ధిక్కార స్వరంతో, హక్కుల అణచివేతపై అలుపెరుగని పోరులో 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. అనంతరం సీఎల్సీ జిల్లా సహాయ కార్యదర్శి కుంచం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో హైకోర్టు అడ్వొకేట్ డి.సురేష్‌కుమార్ ప్రజా సంక్షేమం కోసం సాగే ఉద్యమాల అణచివేతలో ప్రభుత్వాలు చట్టాలను ఉల్లంఘిస్తున్నాయంటూ ఉపన్యసించారు. సాయంత్రం సీఎల్సీ జిల్లా కమిటీ సీనియర్ నాయకులు ఎం.బ్రహ్మం అధ్యక్షతన జరిగిన సభలో మానవ వికాస కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు బి.సాంబశివరావు సంఘంలో ఆచార సంప్రదాయాలపై శాస్త్రీయ విశ్లేషణ చేశారు. సీఎల్సీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న సంఘటనలు, వాస్తవ విషయాలతో 'మణిపూర్ నిజనిర్ధారణ కమిటీ రిపోర్టు'ను వివరించారు. సీఎల్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజా కళామండలి గాయక బృందం ఆధ్వర్యంలో అభ్యుదయ గీతాలను ఆలపించారు. రాయసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పలు ప్రజాసంఘాల నేతలు, ప్రజాస్వామ్యవాదులు హాజరయ్యారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.137	స్కిన్‌లెస్ చికెన్	: రూ.262
లేయర్ (లైవ్)	: రూ.118		
బ్రాయిలర్ చికెన్	: రూ.240	లేయర్ చికెన్	: రూ.200

చీరకు మంటలు అంటుకొని మహిళ మృతి

వెంకటాచలం: పూజ చేస్తుండగా కర్పూరం మంటలు చీరకు ప్రమాదవశాత్తూ అంటుకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గొలగమూడిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉడతా ఈశ్వరమ్మ (60) తన నివాసంలో పూజ చేస్తూ కర్పూరాన్ని వెలిగించారు. మంటలు ప్రమాదవశాత్తూ చీరకు అంటుకున్నాయి. గమనించిన కుటుంబసభ్యులు మంటలను అదుపు చేసి చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి ఆమె మృతి చెందారు. మృతురాలి కుమార్తె అమరావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ సమస్యల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు.. కోవూరులోని స్టౌ బీడీ కాలనీకి చెందిన ఖలీల్‌కు భార్య, ముగ్గురు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు రఫీ (23) పడుగుపాడులోని పాతసీసాల దుకాణంలో పనిచేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. కుటుంబ సమస్యల నేపథ్యంలో సుమారు నెల క్రితం ఆయన అలిగి ఇంటి నుంచి నెల్లూరొచ్చారు. భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో గృహాల్లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఎప్పటిలాగే పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన తన గదిలోనే ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ బాబీ ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో గది తలుపులు పగలగొట్టి మృతదేహాన్ని కిందికి దించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న రఫీని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో బాలిక..

వెంకటాచలం: పాము కాటుతో బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు.. తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని మంగళంపాడు గిరిజనకాలనీకి చెందిన చెంచయ్య తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి స్థానికంగా ఉన్న రైస్ మిల్లు వద్ద నివాసం ఉంటున్నారు. ఆరుబయట మంచంపై చెంచయ్య.. భార్య, ముగ్గురు పిల్లలు కలిసి నివాసంలో నేలపై శుక్రవారం రాత్రి నిద్రించారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చెంచయ్య చిన్న కుమార్తె (3) ఏడవడంతో అందరూ నిద్ర లేచి లైట్ వేయగా, నివాసంలో కట్ల పాము కనిపించింది. పాము కాటేసిందనే అంశాన్ని గుర్తించి చికిత్స నిమిత్తం సర్వేపల్లికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే బాలిక మృతి చెందిందని నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.5

ప్రకటన

Coutner Signed by :
Dr. Bandi Indrasena

యస్. శ్రీనివాసమూర్తి, B.A. B.L.
అడ్వకేట్,
16/1085, ట్రంకురోడ్డు, నెల్లూరు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి